epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 91 | మంగళవారం | 13.08.2024



అంతర్జాతీయ వేదికపై..

## మనోడు..

- ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైన రఘుపతి లఘు చిత్రం
- అభినందనలు తెలిపిన స్థానికులు



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం జరిగిన లఘుచిత్ర పోటీల్లో (ఓయూ) ఈఎమ్మార్సీ డైరెక్టర్ పోరెడ్డి రఘుపతి రూపొందించిన లఘుచిత్రం 'రీచింగ్ ది అన్ రీచ్డ్' మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామానికి చెందిన పోరెడ్డి రఘుపతి ఉస్మానియా విశ్వవిద్యాలయం యూజీసీ-సీఈసీ 16వ అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం నిర్మించిన లఘుచిత్ర పోటీల్లో ఓయూ ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్ ఈఎమ్మార్సీ సత్తా చాటింది. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లోని విద్యార్థుల స్థితిగతులపై ఈఎమ్మార్సీ డైరెక్టర్ పి.రఘుపతి రూపొందించిన లఘుచిత్రం " Reaching the Unreached" అభివృద్ధి విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మానవహక్కుల విభాగంలోనూ సైటేషన్ కు ఎంపికైంది. యూజీసీ, సీఈసీ ఏటా పర్యావరణం, అభివృద్ధి, మానవహక్కులు, స్వచ్ఛ భారత్ విభాగాల్లో లఘుచిత్ర పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో ఎంపికైన చిత్రాలను ఏటా నిర్వహించే ప్రకృతి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శిస్తారు. విజేతలకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేస్తారు. జనజీవనానికి దూరంగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గుత్తికోయ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉద్దేశంతో ఓయూ జర్నలిజం విద్యార్థులు సంతోష్ ఇస్రం తన మిత్ర బృందంతో కలిసి ఏర్పాటు చేసిన ఏకోపాధ్యాయ భీం చిల్డ్రన్ హ్యాపినెస్ కేంద్రాలపై రఘుపతి లఘుచిత్రం రూపొందించటం అభినందనీయమని ఓయూ రిజిస్ట్రార్ పి.లక్ష్మీనారాయణ అన్నారు. ఈ అవార్డు దక్కటం ఓయూకు గర్వకారణమని, ఈఎమ్మార్సీకి మరింత ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు. త్వరలో జరిగే అంతర్జాతయ ఫిల్మ్ ఫెస్టివల్ లో రఘుపతి ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా లఘుచిత్ర రూపకర్త రఘుపతిని ఓయూ ఇంఛార్జ్ ఉపకులపతి దానకిశోర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం అభినందించారు. ఇలాంటి లఘుచిత్రాలు మరిన్ని రూపొందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్యుమెంటరీ రూపకల్పనలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు. లఘు చిత్ర రూపకల్పనలో రఘుపతికి అవార్డు రావడంతో స్వగ్రామం సముద్రాలకు చెందిన బాల్యమిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

జనగామలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా యాత్ర' 2 హర్ ఘర్ రోజ్ గార్ కార్యక్రమం చేపట్టండి..



గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి 2

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గోదావరి జలాలపై ప్రభుత్వం స్పందించాలి 4

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



భూ సమస్యలు పరిష్కరిస్తాం.. 3

- కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

General News



# గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** గ్రీవెన్స్‌లో స్వీకరించిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి ప్రజావాణి లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై 84 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ దరఖాస్తుతో పాటు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో గ్రీవెన్స్ కు రావాలని కలెక్టర్ అర్జీదారులకు సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## క్రీడా పోటీలు షురూ...

**స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ధర్మకంచలోని మినీ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఏర్పాటు చేసిన క్రీడలను అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సోమవారం ప్రారంభించారు. జిల్లా స్థాయి అధికారులు, సిబ్బందికి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్ క్రీడలను పరిశీలించారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలిస్తూ పటిష్టంగా చేపట్టాలని అన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తూ పనులు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పార్థసారథి, ఆర్డీవో కొమరయ్య పాల్గొన్నారు.** - మన చౌరాస్తా, జనగామ

# రూ.కోటి అప్పు చేసి పరార్

## న్యాయం కోసం ఎస్పీకి ఫిర్యాదు




**నల్లగొండ, మన చౌరాస్తా :** కోటి రూపాయలకు పైగా అప్పు తీసుకుని పారిపోయిన వారిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు బాధితులు సోమవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశారు. నకిరేకల్ పట్టణానికి చెందిన తాటికొండ రేణుక, ఆమె భర్త శ్రీనివాసచారి 14 మంది వద్ద రూ.కోటి 80 లక్షలు అప్పుగా తీసుకుని ఎవరికి చెప్పకుండా పారిపోయినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పు రూపంలో డబ్బు తీసుకుని పారిపోయిన దంపతులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తగిన న్యాయం చేయాలని బాధితులు వనిత, రాధిక, అజీరా, నరేష్, వెంకట్ రెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

- బండి సంజయ్‌కి దమ్ముంటే.. హర్ ఘర్ రోజ్ గార్ కార్యక్రమం చేపట్టు
- కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, మన చౌరాస్తా :** కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. ఆయనకు దమ్ముంటే హర్ ఘర్ తిరంగా పండుగ జరిగే సమయంలోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి 'హర్ ఘర్ రోజ్ గార్' కార్యక్రమం చేపట్టాలని సవాల్ విసిరారు. ఈ మేరకు వెలిచాల మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 5.50 లక్షల హౌస్ హోల్డర్లకు లబ్ధి చేకూర్చే పనులు చేయాలని డిమాండ్ చేశారు. ఊరికే ఊకదంపుడు ఉపన్యాసాలు మానుకోవాలని హితవు పలికారు. నమ్మి గెలిపించిన ప్రజల ఆశలు వమ్ము చేయవద్దని, వారి ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు పోవాలని సూచించారు. కేంద్ర మంత్రి పదవిలో ఉన్నందున సంజయ్ కుమార్ కరీంనగర్‌కు పేరు తీసుకువచ్చే విధంగా మెలగాలని పేర్కొన్నారు. సంచలనాల కోసం కాంగ్రెస్ విమర్శించడం పనిగా పెట్టుకోవద్దని సూచించారు. మీకు దమ్ముంటే తెలంగాణ అభివృద్ధి, కరీంనగర్ అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. దేశ సమైక్యత, సమగ్రత, దేశభక్తి పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ జెండా ఎగురవేయడం తమ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ మహనీయులను స్మరించుకోవడం ప్రతి ఇంట జెండా ఎగరవేయడం మన లక్ష్యమని పేర్కొన్నారు.



# జనగామలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా యాత్ర'

**జనగామ, మన చౌరాస్తా :** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జనగామలో బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ మేరకు సోమవారం స్థానిక జనగామ రైల్వే స్టేషన్ నుంచి బస్ స్టాండ్ చౌరస్తా వరకు జాతీయ జెండాను చేతుల్లో పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆగస్టు 15న జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటి మీద జాతీయ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. నేడు బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి భారతీయుడు ఖండించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జేఆర్‌వీఎన్ రెడ్డి, బీజేపీ నాయకులు శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, హర్ గర్ తీరంగ కన్వీనర్ ఎగుర్ల విజయ భాస్కర్, లేగ రామోహన్‌రెడ్డి, దుబ్బ రాజశేఖర్ గౌడ్, కోటేశ్వర్, మార్క ఉపేందర్ గౌడ్, పవన్ శర్మ, హరిచంద్ర గుప్తా, దడిగే రవి, సంతోష్, యువ మోర్చ ప్రధాన కార్యదర్శి కీర్తి వెంకటేష్, వివిధ మండల అధ్యక్షులు, ప్రోగ్రాంకో కన్వనర్లు పెద్దజొని రాజు, ప్రదీప్, యువ మోర్చ నాయకులు పాల్గొన్నారు.

Local News



# భూ సమస్యలు ఉండకూడదు

■ **కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి**

**బచ్చన్నపేట / మద్దూరు, మనచౌరాస్తా :** రాష్ట్రంలో భూ సమస్యలు ఉండకూడదని, దానికి గానూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రత్యేక ధరణి కమిటీని నియమించారని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన రైతుల భూ సమస్యలు, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మర్మాముల శివారులో ఉండడంతో ఆ సమస్యలను తెలుసుకోవడానికి గ్రామానికి వచ్చారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బండనాగారం, బంజేరు గ్రామాల రైతులు దాదాపు 30 మందికి 45 ఎకరాల మేర భూమికి పట్టేదారు పాసుపుస్తకాలు అందలేదన్నారు. ఈ గ్రామంలో ఓ వ్యక్తి ఆ భూమిని మొత్తం పట్టా చేసుకొని ఈ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. భూమి పట్టా లేక ఆ రైతులకు రైతు భరోసా, రైతు భీమా వర్తించడం లేదని బ్యాంకులలో పంటల రుణాలను తీసుకోవడానికి కూడా నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలోనే ఆర్ఆర్ 2024 చట్టలను తీసుకురాబోతున్నామని, అప్పుడు ఈ రైతులు దరఖాస్తు చేసుకొని పట్టాలను పొందవచ్చన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావుతో మాట్లాడి అవసరమైతే సీఎం దృష్టికి కూడా తీసుకుపోతానని తెలిపారు. ఈ ప్రాంత రైతులకు ఏ భూ సమస్యలు ఉన్నా సంప్రదించాలని అవసరమైతే ధరణిలో మార్పులు చేర్పులు చేయడానికి సలహాలను కూడా ఇవ్వాలని తెలిపారు. వీరి వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణరెడ్డి, రైతులు జంగిలి యాదగిరి, అంజనేయులు, సాయిబాబ, స్వామి, తిరుపతి, ఉప్పలయ్య ఉన్నారు.

## ఇళ్ల స్థలాల కోసం వినతి పత్రం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** అర్హులైన విలేకరులకు ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించి ఇవ్వాలని బచ్చన్నపేట మండల విలేకరులు కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డిని కోరారు. ఈ మేరకు మండలానికి వచ్చిన ఆయనకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ విలేకరుల సమస్య న్యాయమైందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల స్థలాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో బచ్చన్నపేట విలేకరులు వీరయ్య గౌడ్, మురళి, శ్రీనివాస్ రెడ్డి, హరికుమార్, కరుణాకర్, భిక్షపతి, మల్లేష్, భాస్కర్, బాల సిద్ధులు, స్వామి ఉన్నారు.

# భూమి కేటాయింపునకు కృషి చేస్తా

■ **డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి**



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు 5 ఎకరాల స్థలం కేటాయింపునకు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హామీ ఇచ్చారు. జనగామ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల ప్రతినిధులు కొమ్మూరికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నర్మెట మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి లేకపోవడంతో స్వయంగా కొమ్మూరి ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి డొనేట్ చేశారని గుర్తు చేశారు. బంజారాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. జనగామ మండల పరిధిలోని చెంపకిల్స్ ప్రాంతంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు కూడా ఐదు ఎకరాల స్థలం కేటాయించి భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి తక్షణమే గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, జనగామ కలెక్టర్ల ద్వారా స్థలం కేటాయింపు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గిరిజన సంఘాల నాయకులు మూడ్ లక్ష్మణ్ నాయక్, గుగులోతు లచ్చయ్య నాయక్, భూక్యా చందు నాయక్, రామావత్ మీట్యా నాయక్, లకవాత్ నరేష్ నాయక్, గిరిజన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొమురవెల్లి దేవస్థాన ఏఈఓ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్వంలో భాగంగా సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో ఆయన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సురేందర్, శ్రీరాములు, భాస్కర్ రావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చేర్యాల, మన చౌరాస్తా :** ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్ పాల్గొని మాట్లాడుతూ దేశం కోసం తమ సంఘం ఎంతో కృషి చేసిందని ఎన్నో పోరాటలకు వెనుకాడలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ పాత్ర మరువలేనిదని అన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటాలు చేస్తుందని అన్నారు. అదే విధంగా ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థి సంఘం ఉత్సవాలు ఈ నెల 12 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నామని నాయకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అంతకు ముందు సంఘం జెండా ఆవిష్కరణ ను సంఘం జిల్లా మహిళా కన్వీనర్ ఆకుల శిరీష ఆవిష్కరించారు.

## డివిజన్ సాధన కోసం పోరాడితే అక్రమ కేసులు

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం జేఏసీ ఆధ్వర్యంలో పోరాడితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని జేఏసీ నాయకులు అందె అశోక్, ఆది శ్రీనివాస్, బూరుగు సురేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం నేటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అడ్డుకొని నిరసన వ్యక్తం చేసిన సందర్భంగా నాడు బీఆర్ఎస్ నాయకులు పెట్టించిన అక్రమ కేసులకు సోమవారం జేఏసీ నాయకులు సిద్దిపేట కోర్టుకు హాజరయ్యారు. రెవెన్యూ డివిజన్ ప్రకటన చేసిన తర్వాతనే చేర్యాలలో అడుగుపెడతా అని చెప్పిన పల్లా రాజేశ్వర్రెడ్డి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు తమపై అక్రమంగా పెట్టించిన కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.



# ఘనంగా చంద్రపవన్‌రెడ్డి జన్మదినం



**హైదరాబాద్, మన చౌరాస్తా :** పవన్ మోటార్స్ అధినేత కోమటిరెడ్డి చంద్రపవన్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మోటార్స్‌లో ఉద్యోగుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మోటార్స్ బిజినెస్ హెడ్ రవిరెడ్డి మాట్లాడుతూ చంద్రపవన్‌రెడ్డి పలు సంస్థలు నెలకొల్పి జనగామ, భువనగిరి, నల్లగొండలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. మంచి మనసుతో అనేక మందికి తోడ్పాటును అందిస్తున్న ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తండ్రి, బాబాయిల బాటలో నడుస్తూ అనేక మందికి ఆదర్శం ఉన్న చంద్రపవన్‌రెడ్డి ఇంకా అనేక మందికి జీవనోపాధి కల్పించాలన్నారు. హైకోర్టు ఆవరణలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో కూడా చంద్రపవన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ రవీందర్‌రెడ్డితో పాటు పలువురు లాయర్లు పాల్గొన్నారు.





# గోదావరి జలాలపై ప్రభుత్వం స్పందించాలి

## ■ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**చేర్యాల, మన చౌరాస్తా :** గోదావరి జలాల విషయంలో ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో 147 మందికి రూ.39 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ అసెంబ్లీ లో జలాల గురించి మాట్లాడానని అన్నారు. గోదావరి జలాలతో చెరువులు నింపాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి లేదనిన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ రైతులకు సాగు నీరు అందించడంలో విఫలమైందన్నారు. అనంతరం మండలంలోని వీరన్నపేటలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు స్వరూపారాణి శ్రీధర్ రెడ్డి, నిమ్మ రాజీవ్ రెడ్డి, ఆనంతుల మల్లేశం, మెడిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**బచ్చన్నపేట :** బచ్చన్నపేట మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై 62 మంది బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు, ఆరోగ్యరీత్యా పలు ఆసుపత్రిల్లో చికిత్సలు పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఓ వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడిగం చంద్రారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, భావండ్ల కృష్ణంరాజు, మద్దికుంట రాధారెడ్డి, నాయకులు చల్ల శ్రీనివాస్ రెడ్డి, ఈదులకంటి ప్రతాప్ రెడ్డి, దూడల కనకయ్య గౌడ్, నరేందర్, శివకుమార్, షబ్బీర్, మల్లారెడ్డి, సాగర్ గౌడ్, కానుగంటి బాలచందర్, ఆజామ్, కిష్టయ్య, భాస్కర్, ఐలయ్య, గూడ సిద్ధారెడ్డి, వేణుగోపాల్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

# మల్లేశం గెలుపునకు కృషిచేయాలి

## ■ పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్



**చేర్యాల, మన చౌరాస్తా :** రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలు ఈ నెల 18న జరుగుతున్న సందర్భంగా అందులో పోటీ చేస్తున్న సిద్దిపేట వాస్తవ్యుడు బూర మల్లేశంకు మన ప్రాంత పద్మశాలీలు ఓటు వేసి గెలిపించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి సతీష్, ఉపాధ్యక్షుడు ఆడెపు చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు దూడెం వెంకటేశం, నాయకులు నాగుల వెంకటేశం, ఆడెపు మహేష్, గోనె శివకుమార్, మలిపెద్ది వెంకటేశం కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన చేర్యాలకు విచ్చేసిన వారు స్థానిక మార్కండేయ దేవాలయంలో జరిగిన సంఘ సమావేశంలో మాట్లాడారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపించాలని సమాజ సేవకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోనె కిషన్ రావు, ఇప్పకాయల మల్లేశం, గోనె బిక్షపతి, పాము బాలనర్సయ్య తో పాటు కుల పెద్దలు పాల్గొన్నారు.

# ఆర్యభట్ట స్కూల్లో ఘనంగా బోనాల పండుగ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట స్కూల్‌లో బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు అమ్మవారి అవతారంలో బోనాలు ఎత్తుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుజన చంద్ర భరత్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయమైన బోనాల పండుగ విశిష్టతను పిల్లలకు తెలిసేలా పాఠశాలలో ఈ పండగ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు టీచర్లు పాల్గొన్నారు.







'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# అదరగొట్టిన మిల్కీ బ్యూటీ

**మన చౌరాస్తా, సినిమా :** టాలీవుడ్ హీరోయిన్ తమన్నా ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో చాలా బిజీగా ఉంటుంది. తెలుగుతోపాటు అటు హిందీలోనూ వరుస ఆఫర్స్ అందుకుంటుంది. వెండితెరపైనే కాకుండా ఓటీటీలోనూ సత్తా చాటుతుంది. ఓ వైపు కథానాయికగా.. మరోవైపు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోపాటు వెబ్ సిరీస్ అంటూ తెగ హడావిడి చేస్తున్న తమన్నా.. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్ అదరగొట్టేసింది. ఇన్నాళ్లు తెలుగులో పలు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా అలరించిన తమన్నా.. కేజీఎఫ్, జైలర్ వంటి హిట్ చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ అదరగొట్టింది. ఇప్పుడు బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ మూవీ స్త్రీ 2లో మిల్కీబ్యూటీ గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చింది. తాజాగా స్త్రీ 2 నుంచి తమన్నా స్పెషల్ సాంగ్ రిలీజ్ చేయగా.. అందరి దృష్టిని ఆకర్షించింది. ఇందులో తమన్నా డాన్స్ చూసి అడియన్స్ ఫిదా అవుతున్నారు. బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావ్, అపరశక్తి ఖురానా, అభిషేక్ బెనర్జీ, పంకజ్ త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఆగస్ట్ 15న విడుదల కానుంది. 2018లో వచ్చిన సూపర్ హిట్ స్త్రీ సినిమాకు సీక్వెల్ గా ఈ మూవీని రూపొందించారు. స్త్రీ సినిమాలో బీటౌన్ బ్యూటీ నోరా ఫతేహి స్పెషల్ సాంగ్ చేయగా.. ఇప్పుడు ఆ సీక్వెల్‌లో తమన్నా భాటియాకు అవకాశం వచ్చింది. అమర్ కౌశిక్ 'స్త్రీ 2' చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి దినేష్ విజన్ నిర్మాతగా వ్యవహరించగా.. కొన్ని రోజులుగా ప్రమోషన్స్ భారీగా జరుగుతున్నాయి. ఆరేళ్ల క్రితం స్త్రీ సినిమా సూపర్ హిట్ కావడంతో స్త్రీ 2పై మరింత హైప్ పెరిగింది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ మూవీపై మరిన్ని అంచనాలు పెంచగా.. ఇప్పుడు విడుదలైన స్పెషల్ సాంగ్ ఆకట్టుకుంటుంది. యూట్యూబ్ లో మిలియన్స్ కొద్దీ వ్యూస్ రాబట్టింది. గతంలో జైలర్ సినిమాలోని తమన్నా చేసిన కావాలయ్యా పాట కూడా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే.